నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా 11 కేవీ భూపతి రావు నగర్ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు భూపతిరావు నగర్, శక్తి గణేష్ నగర్, అల్వాల్ హిల్స్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు సికింద్రాబాద్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మురళీ కృష్ణ తెలిపారు. అదేవిధంగా రిసాల బజార్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని రిసాలబజార్, ప్రేమ్‌నగర్, జీఎస్ఆర్ ఎన్‌క్లేవ్, బంజారానగర్, బొల్లారం కుటియా మందిర్ ప్రాంతాల్లో ఉదయం 12 నుంచి 2 గంటల వరకు, ఫాదర్ బాలయ్య నగర్ ఫీడర్ పరిధి లోని ఎఫ్‌బీనగర్, భవానీనగర్, సిటిజన్ కాలనీ, అయ్యప్ప నగర్, అంబేద్కర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో...) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 23, బజ్జీమిర్చి 15, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 15, దొండ 40, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 40, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 23, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 21, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సమస్యల పరిష్కారానికి కృషి


స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదం సంతోష్

బౌద్ధనగర్: స్థానికంగా నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తానని కాంగ్రెస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జ్ ఆదం సంతోష్‌కుమార్ అన్నారు. ఆదివారం బౌద్ధనగర్‌లోని అశోక్‌నగర్, సంజీవయ్య నగర్ తదితర ప్రాంతాల్లో ఇంజినీరింగ్, శానిటేషన్, ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్ విభాగాల అధికారులతో సమస్యలపై పర్యటించారు. సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులతో చర్చించినట్లు తెలిపారు. డివిజన్ అధ్యక్షులు అనిల్ కుమార్, అమర్నాథ్ గౌడ్, షకీల్, వహీద్, బబ్లు, శ్రీకాంత్, లడ్డు, అలీమ్, పార్టీ కార్యకర్తలు, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి చేయాలి


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన డీఎస్‌ఎంకాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు

సనత్‌నగర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ కాలనీల అభివృద్ధికి కమిటీ సభ్యులు కృషి చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని డీఎస్‌ఎం కాలనీ నూతన కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. కాలనీ చైర్మన్ నోమానోద్దీన్, అధ్యక్షుడు జమీర్, ప్రధాన కార్యదర్శి మన్నన్, ఉపాధ్యక్షుడు శంషీర్, అబ్దుల్ రహీం, సర్దార్ తదితరులు ఉన్నారు.

అలరించిన మాధుర్ విద్యాలయ వార్షికోత్సవం


మాధుర్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

సికింద్రాబాద్: వారాసీగూడలోని మాధుర్ విద్యాలయ 12వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం బీఎస్ఆర్ గార్డెన్‌లో సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులకు కనువిందు చేశాయి. వేడుకలకు ముఖ్య అతిథులుగా ప్రైవేటు పాఠశాలల సంఘం గ్రేటర్ ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ, ముషీరాబాద్ మండల అధ్యక్షుడు సందీప్ కుమార్ హాజరయ్యారు. పాఠశాల కార్యదర్శి ఆర్‌వీఎల్ఎస్ ప్రసాద్, ప్రిన్సిపాల్ రాజేశ్వరి పాల్గొన్నారు.

సమ్మర్‌లో స్పెషల్ డ్రైవ్

ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్యలు అధిగమించడానికి చేపట్టిన ప్రధాన జంక్షన్ల ఆధునీకరణ పనులు వేసవిలో పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం అవసరమైన పనులు చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నారు. వర్షాకాలంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. విద్యుత్, జలమండలి విభాగాల ఆధ్వర్యంలోని అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జీహెచ్‌ఎంసీ అధికారులు లేఖలు రాశారు. –సికింద్రాబాద్

జంక్షన్ల ఆధునీకీకరణపై దృష్టి ● పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ల తొలగింపు

సిగ్నళ్లు, జీబ్రాలైన్ల ఏర్పాటు ● జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్ణయం


తార్నాక జంక్షన్‌లో ఆధునికీకరణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయిన దృశ్యం

మూడు నెలలుగా ఫుట్‌పాత్‌ల పరిరక్షణ కోసం జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. అత్యంత రద్దీగా ఉండే మోండా మార్కెట్ సహా అన్ని రహదారుల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించిన అధికారులు తాజాగా జంక్షన్ల ఆధునికీకరణ పనులు పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

తాజా నిర్ణయాలు ఇవీ!

- బ్యూటిఫికేషన్ ఆఫ్ జంక్షన్స్ పథకంలో భాగంగా ఉత్తర మండలం పరిధిలోని అన్ని సర్కిళ్ల ప్రధాన జంక్షన్లలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను మరో చోటికి మార్చాలని నిర్ణయించారు. ఇప్పటికే సికింద్రాబాద్ సహా పలు సర్కిళ్లలోని కూడళ్లలో తొలగించాల్సిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించే పనులు సత్వరమే ప్రారంభించాలని విద్యుత్‌శాఖ అధికారులకు జీహెచ్‌ఎంసీ అధికారులు లేఖలు రాశారు.
- మారియట్ హోటల్, మయూర్ మార్గ్ సహా ఎంపిక చేసిన 10 ప్రాంతాల్లో చెట్లు తొలగించాల్సి ఉంది. ఇక్కడి చెట్లను నరికివేయకుండా వేళ్లతో సహా పెకిలించి మరో చోట పాతేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మార్చి మొదటి వారంలో ఈ పనులు పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.
- ప్యాట్నీ సెంటర్, సంగీత్ తదితర కూడళ్లలో వాహనాలు, పాదచారులకు మార్గం సుగమం చేసేందుకు సిగ్నల్స్ ఏర్పాటు, జీబ్రాలైన్స్ వేయడం, యూ టర్న్‌ల ఏర్పాటు కోసం అంచనాలు రూపొందించాలని ట్రాఫిక్ పోలీసులకు జీహెచ్‌ఎంసీ అధికారులు లేఖలు రాశారు. ఇప్పటికే విస్తరించిన ఈ కూడళ్లలో అత్యాధునిక సిగ్నలింగ్ వ్యవస్థ, జీబ్రా లైన్స్ వేయాల్సి ఉంది.
- పద్మానగర్, నాగమయ్యకుంట తదితర ప్రాంతాల్లో రహదారుల భూగర్భంలోంచి నెలకొన్న కేబుళ్ల తొలగింపు కోసం పనులు ప్రారంభించాల్సి ఉంది. జంక్షన్ల ఆధునికీకరణకు కేబుళ్లు అడ్డుగా ఉన్నందున సత్వరమే కేబుళ్లు తొలగించాల్సి ఉంది.
- రైల్ నిలయం రోడ్డు గ్రిల్ 9 హోటల్, రైల్వేస్టేషన్ ఔట్‌గేట్ సమీపంలోని అల్పా హోటల్ వద్ద ధ్వసం అయిన మ్యాన్‌హోల్స్ స్థానంలో కొత్త నిర్మాణాల కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అశోక్‌నగర్ వంతెన నిర్మాణం పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు.

ఎఫ్‌ఓబీల పట్ల ప్రత్యేక చర్యలు

- ఉత్తర మండలం పరిధిలోని పలు ఫుట్‌ఓవర్ల వద్ద ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. ఇందుకోసం ఆయా ప్రాంతాల ఇంజినీరింగ్ అధికారులకు వంతెనల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్ణయించారు.
- లిఫ్టుల పనితీరు, విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవడం, వంతెనల వద్ద ప్రయాణికుల సౌకర్యం కోసం అవసరమైన అధికారులు, పర్యవేక్షకుల నెంబర్లతో కూడిన సూచికలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. లిఫ్టులు, విద్యుత్ దీపాలు పనిచేయని సందర్భాల్లో ప్రయాణికులు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు వీలుగా సైన్‌బోర్డులు ఏర్పాటు చేయనున్నారు.

వేసవిలోనే అన్ని పనులు పూర్తి

- వేసవి కాలంలోనే నిర్దేశిత పనులు అన్నీ పూర్తి చేయాలని ఐదు సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, జలమండలి, విద్యుత్ శాఖ అధికారులకు ప్రత్యేక లేఖలు రాశారు. ప్రతిపాదిత అభివృద్ధి పనులను ఆయా విభాగాల అధికారులను సమన్వయంతో పూర్తి చేయాలని డీసీలను ఆదేశించారు.
- వర్షాలు ప్రారంభమైతే అభివృద్ధి పనులు ముందుకు సాగే అవకాశం లేనందున వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన కోరారు. మరిన్ని ఫుట్‌ఓవర్ వంతెనలు అవసరమైన ప్రాంతాలను గుర్తించి తమకు నివేదిక అందిస్తే ఏర్పాటు అంశాలను పరిశీలిస్తామని జడ్‌సీ చెప్పారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపించాలి


డ్రాపౌట్ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సీఆర్‌పీఎఫ్ ప్రతినిధులు

అడ్డగుట్ట: బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలకు పంపిచాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక (సీఆర్‌పీఎఫ్) మండల కన్వీనర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం తుకారాంగేట్‌లోని మరాఠా బస్తీలో అడ్డగుట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్కూల్ డ్రాపౌట్ పిల్లల ఇళ్లను సందర్శించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను విధిగా పాఠశాలకు పంపించాలని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ పవన్‌రాజ్ పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు



రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్ నల్లగుట్టలోని పీర్ హజ్రత్ సయ్యద్ గులాం అలీ షా ఖ్వాద్రీ ఉర్సు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్గాను సందర్శించి ప్రార్థనలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్ దర్గా కమిటీ సభ్యులు అష్రఫ్‌బాయ్, షంషుద్దీన్, సర్ఫరోజ్, ముజాహిద్, అబ్దుల్ గఫార్ పాల్గొన్నారు.

ఘనంగా సంత్ గాడ్గే బాబా జయంతి


సంత్ గాడ్గే బాబా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

సికింద్రాబాద్: కర్మయోగి సంత్ గాడ్గే బాబా జయంతి వేడుకలు ఆదివారం మెట్టుగూడ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా జరిగాయి. బీజేపీ రాష్ట్ర మహిళా నాయకురాలు మల్లేశ్వరపు రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మహంకాళి జిల్లా బీజేపీ నాయకుడు భరత్ గౌడ్ హాజరై సంత్ గాడ్గే బాబాచిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ,బీజేవైఎం నాయకులు శివాజీ, ప్రభు గుప్త, సరోజ, చందు తదితరులు పాల్గొన్నారు.

విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి


కార్యక్రమంలో పాల్గొన్న డీబీఎఫ్ ప్రతినిధులు

సికింద్రాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన డిమాండ్ చేశారు. ఆదివారం డీబీఎఫ్ అధ్వర్యంలో సీతాఫల్ మండిలో అంబేద్కర్ విగ్రహానికి 14 వవారం జ్ఞానమాల వేశారు. ఈ సందర్భంగా పులి కల్పన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించిందన్నారు. గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో కేవలం 7 శాతం నిధులు మాత్రమే కేటాయించి హామీని విస్మరించారని అన్నారు. రానున్న బడ్జెట్ లోనైనా ఎన్నికల హామీ ప్రకారం 15 శాతం నిధులు కేటాయించి మాట నిలబెట్టుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

'తరుణి' సేవలు అభినందనీయం


కార్యక్రమంలోమాట్లాడుతున్న డాక్టర్ సౌమ్యా మిశ్రా

సనత్‌నగర్: బాల్య వివాహ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన తరుణి స్వచ్ఛంద సంస్థ కృషి అభినందనీయమని జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్యామిశ్రా పేర్కొన్నారు. తరుణి స్వచ్ఛంద సంస్థ 25వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం బేగంపేటలోని సెస్ ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్యామిశ్రా మాట్లాడుతూ.. పాతికేళ్లుగా అలుపెరగకుండా బాలికలు, మహిళల కోసం సేవలందిస్తున్న ఇలాంటి సంస్థలు చాలా తక్కువన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. తరుణి డైరెక్టర్ డాక్టర్ మమతా రఘువీర్, డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ వైస్ ప్రెసిడెంట్ ఎంవీ రమణ, హెక్సగాన్ కాపబిలిటీ సెంటర్ హైదరాబాద్ మేనేజింగ్ డైరెక్టర్ నవనీత్ మిత్రా, శ్రీలేఖ, యూనిసెఫ్ హైదరాబాద్ మురళీకృష్ణ, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

బాపూజీనగర్‌లో గ్యార్వీ వేడుకలు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ బాపూజీనగర్‌లో ముస్లింలు గ్యార్వీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపూజీనగర్ ముస్లిం యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో జమ్‌జమ్ మసీద్ చిల్లా వద్ద జాకీర్, మహ్మద్ గౌస్, జహంగీర్ అధ్యర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు జి. పవన్‌కుమార్ గౌడ్ హాజరైనారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బన్సీలాల్‌పేట్ అధ్యక్షులు వెంకటేషన్‌రాజు, మహేందర్ గౌడ్ పాల్గొన్నారు.

బల్కంపేటలో చోరీ

అమీర్‌పేట: పనిమీద బయటకు వెళ్లి తిరిగి వచ్చే సరికి ఓ ఇంట్లో చోరీ జరిగింది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ తెలిపిన మేరకు.. మర్రి శ్రీనివాస్ బల్కంపేటలో నివాసముంటున్నాడు. కూలి పని చేసుకుని జీవించే శ్రీనివాస్ భార్యతో కలిసి 21న ఇంటికి తాళం వేసి పనిమీద బయటకు వెళ్లి తిరిగి సాయంత్రం వచ్చారు. ఇంట్లో పెట్టిన సెల్ ఫోన్‌తో పాటు ఓ డబ్బాలో దాచిన ఒక తులం బంగారు గొలుసు కూడా మాయమైంది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్: మతి స్థిమితం లేని ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... నిర్మల్ జిల్లా చిచోండ్ గ్రామానికి చెందిన ర్యాపన్ లక్ష్మణ్ దంపతులు భవన నిర్మాణ కార్మికులు. వీరి కుమారుడు శ్రీనివాస్ (18) కు మతి స్థిమితం సరిగా లేదు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన శ్రీనివాస్ గుండ్ల పోచంపల్లి– మేడ్చల్ రైల్వే స్టేషన్ ల మధ్యన గల రైల్వే ట్రాక్ వద్దకు చేరుకుని బోధన్ ప్యాసింజర్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహానికి గాంధీ ఆసుపత్రి లో పోస్టు మార్టం చేసిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

5 రోజులే ఇక మిగిలింది

మరోసారి కులగణన సర్వేకు స్పందన అంతంతే.. | వార్డు కార్యాలయాల్లో అందుబాటులో సిబ్బంది.. | బేగంపేట సర్కిల్‌లో ఇప్పటివరకు 56 దరఖాస్తులే..


వార్డు కార్యాలయంలో కుల గణన దరఖాస్తులు, నమోదును పరిశీలిస్తున్న డీసీ సమ్మయ్య

సనత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నవంబర్‌లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఆ సర్వేలో ఇంటికి వచ్చిన ఎన్యుమరేటర్లకు 75 ప్రశ్నలతో కూడిన దరఖాస్తులోని వివరాలు అందించేందుకు చాలా మంది విముఖత వ్యక్తం చేశారు. కొన్ని ఇళ్లకు అసలు ఎన్యుమరేటర్లే వెళ్లలేదనే ఆరోపణలు వెల్లువెత్తాయి. పూర్తి స్థాయిలో సర్వే జరగలేదంటూ పలు వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో ప్రభుత్వం మరోసారి కుల గణనకు అవకాశం కల్పించింది. దీంతో బేగంపేట సర్కిల్ పరిధిలోని వార్డు కార్యాలయాల్లో కుల గణన దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. సర్కిల్ పరిధిలో బన్సీలాల్‌పేట, రాంగోపాల్‌పేట, బేగంపేట, మోండా డివిజన్లు ఉండగా ఆయా డివిజన్లలో వార్డు కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణకు అధికారులు అందుబాటులో ఉండేలా సర్కిల్ కార్యాలయ అధికారులు చర్యలు చేపట్టారు.

ఇప్పటివరకు 56 దరఖాస్తులు.. మరో 5 రోజులు గడువు..

టోల్‌ఫ్రీ నెంబర్, నేరుగా వార్డు కార్యాలయాల్లో వివరాలు అందజేసే పద్ధతుల్లో బేగంపేట సర్కిల్‌లో ఇప్పటివరకు 56 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 16న ప్రారంభమైన రెండో దఫా కుల గణన ఈనెల 28 వరకు కొనసాగనుంది. గతంలో జరిగిన సర్వే ప్రకారం సర్కిల్ పరిధిలో 59,976 కుటుంబాలు ఉండగా 40,160 కుటుంబాల సర్వే జరిగింది. మిగిలిన కుటుంబాలు అందుబాటులో లేకపోవడమో లేక వివరాలు ఇచ్చేందుకు అయిష్టత చూపడమో కారణంగా వివరాలు సేకరించలేదు. ఇప్పుడైనా మిగిలిన కుటుంబాలు రెండో దఫా సర్వేలో వివరాలు ఇచ్చేందుకు ముందుకువస్తారా? అని అని సర్కిల్ ఉన్నతాధికారులు ఎదురుచూస్తున్నారు.

ఎక్కడెక్కడ సేకరిస్తున్నారంటే..

- బేగంపేట డివిజన్ ప్రాంత ప్రజలకు పాటిగడ్డ మోడల్ మార్కెట్‌లోని వార్డు కార్యాలయం
- రాంగోపాల్‌పేట డివిజన్‌కు ఎంజీరోడ్డులోని ప్రభుత్వ పాఠశాల
- బన్సీలాల్‌పేట డివిజన్‌కు కీస్ బ్లాక్ కమ్యూనిటీ హాల్
- మోండా డివిజన్‌కు పరికి బస్తీ కమ్యూనిటీ హాల్
- సనత్‌నగర్ డివిజన్‌కు సంబంధించి ఎస్సార్టీకాలనీలోని నెహ్రూ పార్కులోని గల వార్డు కార్యాలయం
- అమీర్‌పేట డివిజన్‌కు సంబంధించి బీకేగూడ వార్డు కార్యాలయం

రేపటి నుంచి మహాశివరాత్రి మహోత్సవాలు

సనత్‌నగర్: శ్రీహనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలోని శివాలయంలో ఈ నెల 25 నుంచి 27 వరకు మహా శివరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ సత్యనారాయణ తెలిపారు. 25న ఉదయం 6 గంటలకు సామూహిక అభిషేకం, 10 గంటలకు అంకురార్పణ, మహానివేదన మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వినియోగం, 26న మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా తెల్లవారుజామున 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సామూహిక అభిషేకాలు, రాత్రి 7 గంటలకు శివపార్వతుల కళ్యాణ మహోత్సవం, 9 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 10 గంటల నుంచి భక్తి సంగీత కార్యక్రమం (జాగరణ), అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలం సమయంలో మహాహారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయని వివరించారు. అలాగే 27న ఉదయం 7.30 గంటలకు రుద్రహోమం, పూర్ణాహుతి, 9 గంటలకు నానావిధ ఫలాలతో రసాభిషేకం, సాయంత్రం 7.30 గంటలకు శివపార్వతుల ఊయల సేవ (పవళింపు సేవ) ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం


సరిత


వెంకటేష్

అడ్డగుట్ట: తుకారంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రాంతాలలో ఇద్దరు అదృశ్యమయ్యారు. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన మేరకు.. సాయి నగర్ ప్రాంతానికి చెందిన వెంకటేష్ (42) ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 20న వరంగల్ వెళుతున్నానని చెప్పి బయటికి వెళ్లాడు. మూడు రోజులు గడిచినా తిరిగి రాకపోవడంతో భార్య తెలిసిన వారితో వాకబు చేసింది. అయినా ఫలితం లేకపోవడంతో ఆదివారం తుకారంగేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పనికి వెళుతున్నానంటూ మహిళ..

తుకారంగేట్ వడ్డెర బస్తీ ప్రాంతానికి చెందిన వరికుప్పల సరిత(37) సికింద్రాబాద్ గాంధీ అస్పత్రిలో స్వీపర్‌గా పనిచేస్తోంది. శనివారం ఉదయం వంటలు సమయంలో పనికి వెళ్లిన సరిత సాయంత్రానికి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అమె భర్త స్వామి తన భార్య పనిచేసే వద్ద వాకబు చేసిన ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం తుకారంగేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

విద్యార్థి యువ గర్జన సభ వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మంగళవారం నిర్వహించతలపెట్టిన విద్యార్థి, యువజన గర్జన సభను వాయిదా వేసినట్లు తెలంగాణ మాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చినేని వెంకట్ ఆదివారం తెలిపారు. ఎస్సీ వర్గీకరణ జస్టిస్ షమీమ్ అక్తర్ ఏక సభ్య కమిషన్ మార్చి 10 వరకు పొడిగించినందున సభను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. మార్చి 3న మాల విద్యార్థి, యువకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకుంటున్న కళాసిల్క్ మెగా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో



లాలాపేట: ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో కళాసిల్క్ మెగా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనలో సంప్రదాయాలను ప్రతిబింబించే చేనేత వస్త్రాలతో స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన మార్చి 10వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు వికాస్ జైన్ తెలియజేశారు. సమ్మర్ స్పెషల్ కాటన్ వస్త్రాలు ఈ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేకం అన్నారు.

'ఎక్స్'లో పోస్ట్.. కారు సీజ్!

ముగ్గురు యువకులను అరెస్టు చేసిన పోలీసులు

బంజారాహిల్స్: 'ఎక్స్'వేదికగా ఓ వ్యక్తి చేసిన పోస్ట్ ఆధారంగా ఓ కారు డ్రైవర్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. కారు డ్రైవర్ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడమే కాకుండా మితిమీరిన వేగంతో ప్రమాదకరంగా వాహనాన్ని నడుతుండగా ఓ వ్యక్తి ఆ కారును వీడియో తీసి 'ఎక్స్'(ట్విట్టర్)లో పోస్ట్ చేయడంతో పోలీసులు స్పందించి సదరు కారు డ్రైవర్‌పై చర్యలకు దిగారు.

- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ సిగ్నల్ వద్ద శనివారం ఉదయం 7 గంటల సమయంలో (ఏపీ 09 ఏక్యూ 7209) నంబర్ గల కారు రోడ్డు మధ్యలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో పాటు అధిక వేగంతో ప్రమాదకరంగా వాహనాన్ని నడుపుకుంటూ వెళ్లాడు. కారు నడుపుతున్న దృశ్యాలను ఎండీ మౌజం అనే వ్యక్తి వీడియో తీసి తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశాడు.
- ఆదివారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో టెక్ టీమ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కరుణాకర్ సాధారణ పరిశీలనలో భాగంగా ఎక్స్ ఖాతాను పరిశీలిస్తుండగా ఎండీ మౌజం పోస్ట్ చేసిన వీడియోను పరిశీలించాడు. దీంతో చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందిగా కరుణాకర్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని ఈ కారు కోసం గాలించి పట్టుకున్నారు. మలక్‌పేటలోని ప్రజ్ఞ విజయజ్యోతి కాలేజీలో చదువుతున్న మహ్మద్ అబ్దుల్ ఖదిర్, అన్వర్ ఉలుం కాలేజీలో చదువుతున్న ఎండీ అనస్ అహ్మదుద్దీన్, లకోటియా కాలేజీలో చదువుతున్న మహ్మద్ అబ్దుల్ రహద్ కారులో వెళ్తూ స్టంట్లు చేసినట్లుగా గుర్తించారు. ఇష్టారాజ్యంగా దూసుకెళ్తున్నట్లుగా నిర్ధారించి కారును సీజ్ చేసి ఈ ముగ్గురిని అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.